ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 8 జూన్ 2025





త్యాగాలకు ప్రతీక బక్రీద్

మసీదులు, మైదానాల్లో ప్రార్థనలు

ప్యారీస్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): 'త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను శనివారం రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాజధాని నగరం చెన్నైలో ప్రసిద్ధి చెందిన ట్రిప్లికేన్ పెద్ద మసీదు, థౌజండ్ లైట్స్ మసీదు సహా నాగపట్టణం జిల్లాలోని నాగూర్ దర్గా, మదురై తముక్క మైదానం, తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లోని పురాతన మసీదు, రామనాథపురంలో ప్రసిద్ధిచెందిన కాయల్‌పట్టణం, ఏర్వాడి దర్గా, పుదుకోట జుమ్మా మసీదు తదితర ప్రాంతాల్లో విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు, మహిళలు, బాలబాలికలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మసీదులు, ఈద్గాలు కళకళలాడాయి. పరస్పరం ఆలింగనం చేసుకొని ప్రేమాభిమానాలు పంచుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు దానధర్మాలు, ఖుర్బానీ పేరుతో పొట్టేలు మాంసాన్ని దానం చేశారు. తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో బ్రాడ్‌వేలోని డాన్ బాస్కో పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రార్థనలు జరిగిన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసింది.

ఎండలు ఎక్కువే... వానలు కూడా...!

- సాధారణం కన్నా 2-3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు
- ఈదురు గాలులతో వర్షాలు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురువనున్నాయి. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... పశ్చిమ గాలుల వేగంలో మార్పు కారణంగా ఈ నెల 8,9 తేదీల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురుస్తుందని తెలిపారు. 10వ తేది కడలూరు, కళ్లకుర్చి, విల్లుపురం జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరిలో భారీ వర్షం కురిసే అవకాశముంది. 11న ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూర్, వేలూరు, రాణిపేట, కాంచీపురం, తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్లకుర్చి జిల్లాలు, 12న వేలూరు, రాణిపేట, తిరువళ్లూర్ జిల్లాల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని తెలిపింది.

పెరగనున్న ఎండలు... : ఆది, సోమవారాల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాలు పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2-3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని, గాలిలో తేమ శాతం తగ్గి ఉక్కపోత నెలకొంటుందని తెలిపింది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడి తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. అలాగే, ఆదివారం నుంచి 12వ తేది వరకు దక్షిణ తమిళనాడు మన్నార్ జలసంధి ప్రాంతంలో బలమైన గాలులు వీచే అవకాశముందని, జాలర్లు ఆ ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ అయ్యాయి.

భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ

మదురైకి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తమిళ సాహిత్య సంస్కృతికి రాజధానిగా పేరొందిన మదురై నగరానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శనివారం రాత్రి చేరుకున్నారు. రాష్ట్రంలో రెండో విడతగా ఎన్నికల వ్యూహరచనలపై పార్టీ నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలను కలుసుకుని సమగ్రంగా చర్చించేందుకు ఆయన మదురై పర్యటనకు వచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం అమిత్‌షా శనివారం సాయంత్రం ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి మదురై చేరుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగ్రేందన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై తదితర పార్టీ నాయకులు ప్రముఖులు విమానాశ్రయం వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికారు.

నేడు దక్షిణాది జిల్లాల నేతలతో భేటీ...

ఆదివారం ఉదయం 11 గంటలకు అమిత్‌షా మదురై మీనాక్షి అమ్మవారి ని దర్శించనున్నారు. ఆ తర్వాత ఒత్తకడై ప్రాంతంలో ఏర్పాటైన దక్షిణాది జిల్లాలకు చెందిన పార్టీ నేతల సమావేశంలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, పార్టీ జాతీయ కమిటీ సభ్యులు, జిల్లా శాఖ కార్యదర్శులు, మాజీ శాసనసభ్యులు, ప్రాంతీయ ఇన్‌ఛార్జీలు సహా సుమారు 15 వేల మంది పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం ఆయన ఢిల్లీ వెళ్తారు.

భద్రతా ఏర్పాట్లు...

అమిత్‌షా పర్యటనను పురస్కరించుకుని మదురై నగర మంతటా కేంద్రపారిశ్రామిక భద్రతా దళం, రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళం, కమెండోలు సంయుక్తంగా భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నాయి. మదురై విమానాశ్రయం నుంచి అమిత్‌షా బసచేస్తున్న స్టార్ హోటల్ వరకు దారి పొడవునా సాయుధ బలగాలతో నిఘా ఏర్పాటు చేశారు.ఇదే విధంగా మీనాక్షి ఆలయం, ఒత్తకడై ప్రాంతం తదితర ప్రాంతాల వద్ద సుమారు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.అమిత్‌షా పర్యటనను పురస్కరించి మదురై నగరంపై రెండు రోజులపాటు డ్రోన్ల ఎగురవేతపై పోలీసులు నిషేధం కూడా విధించారు.

త్వరలో సంక్షోభానికి తెర అన్బుమణిని మళ్లీ కలవను

- పీఎంకే అధినేత రాందాస్

చెన్నై, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పార్టీలో నెలకొన్న సంక్షోభం త్వరలోనే సమసి పోతుందని, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణిని మళ్ళీ కలుసుకోవాల్సిన అవసరం లేదని, పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ స్పష్టం చేశారు. దిండివనం తైలాపురం గార్డెన్ నుంచి రాందాస్ శనివారం ఉదయం ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు పనయూరులోని తన కుమార్తె శ్రీకాంతి నివాసానికి చేరుకున్నారు. శ్రీకాంతి ఇంటి పక్క వీధిలోనే శ్యామలా గార్డెన్‌లో డాక్టర్ అన్బుమణి నివాసం, కార్యాలయం ఉంది. ఇటీవల తైలాపురంలో అన్బుమణి తన తండ్రి రాందాస్‌తో భేటీ అయినప్పుడు శ్రీకాంతి రాజీ చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కుమార్తె నివాసంలో ఉన్న రాందాస్ మీడియాతో మాట్లాడుతూ అన్బుమణితో అభిప్రాయబేధాలున్నప్పటికీ వాటి వల్ల పార్టీకి ఎలాంటి నష్టం కలగదని చెప్పారు. అన్బుమణి మేనల్లుడు ముకుందన్‌కు తాను పార్టీ పదవిచ్చినా అతడు రాజీనామా చేశాడని, వ్యాపారంపైనే దృష్టిసారిస్తానని చెప్పడంతో రాజీనామాను అంగీకరించానని చెప్పారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మదురై పర్యటన గురించి తనకు తెలియదని, బీజేపీతో పొత్తు కుదుర్చుకోవాలనే ఆలోచన తనకు లేదని రాందాస్ స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను దంతవైద్యుడిని కలిసి చికిత్స కోసమే నగరానికి వచ్చానని తెలిపారు. ఎన్నికల పొత్తు గురించి మాట్లాడే సమయం ఇంకా రాలేదని, ఈ నెల 10న కీలకమైన ప్రకటన చేయనున్నానని రాందాస్ చెప్పారు.

ఎన్నికల సమరానికి సమాయత్తం కండి

- ఈ వేగం చాలదు... ఇంకా పెంచండి
- జిల్లా నేతలకు స్టాలిన్ పిలుపు



క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికల ఏర్పాట్లతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమాలను వేగవంతం చేయాలని డీఎంకే జల్లా కార్యదర్శులు, ఇన్‌ఛార్జులు, బూత్‌కమిటీ ఇన్‌ఛార్జులకు ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ సారి శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 నియోజకవర్గాల్లో గెలిచితీరాలని ఆయన పలు సభలలో చెబుతూ వస్తున్నారు. ఆ లక్ష్యం దిశగా పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తూ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొదట డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం స్టాలిన్ ప్రసంగిస్తూ శాసనసభ ఎన్నికలు వచ్చే యేడాది ఏప్రిల్ లేదా మే నెల ప్రారంభంలో జరిగే అవకాశాలున్నాయని, ఆ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధించాలంటే అన్ని విభాగాల నేతలు, బూత్ కమిటీల ఇన్‌ఛార్జులు సమష్టిగా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని, ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేయాలని ఇటీవల మదురైలో జరిగిన పార్టీ సర్వసభ్యమండలి సమావేశంలో పిలుపునిచ్చానని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రచార కార్యక్రమాలు, సభ్యత్వ ముమ్మర కార్యక్రమాలను మందకొడిగానే సాగుతున్నాయని, అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో సభ్యత్వ నమోదులో ఇంకా వేగం పెంచాలన్నారు. ప్రతి బూత్ పరిధిలో కనీసం 30 శాతం మందికి పార్టీ సభ్యత్వం కల్పించాలని, ప్రత్యేకించి యువతకు సభ్యత్వం కల్పిస్తే మరీ మంచిదన్నారు. జిల్లా కార్యదర్శులు తమ దిగువ పనిచేసే బూత్ కమిటీ ఇన్‌ఛార్జులకు శిక్షణ కూడా ఇవ్వాలని, పార్టీ అధిష్ఠానం ప్రచారానికి సంబంధించిన కరపత్రాలను పంపిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, ఐ. పెరియసామి, శివశంకర్, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, టీఆర్‌బీ రాజా, ఎంపీలు టీఆర్ బాలు, కనిమొళి, జగద్రక్షగన్, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కమల్ ఆస్తుల విలువ రూ.305 కోట్లు



ప్యారీస్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి రాజ్యసభకు పోటీచేస్తున్న డీఎంకే, అన్నాడీఎంకేకు చెందిన ఆరుగురు అభ్యర్థుల ఆస్తుల వివరాలను ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఈ నెల 19న జరిగే రాజ్యసభ ఎన్నికలకు డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ శివలింగం, ప్రముఖ తమిళ కవయిత్రి సల్మా, డీఎంకే మిత్రపక్షం అభ్యర్థిగా ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్, ప్రతిపక్షం అన్నాడీఎంకే నుంచి సీనియర్ న్యాయవాది ఐఎస్ ఇన్బదురై, మాజీఎమ్మెల్యే ఎం.ధనపాల్ సచివాలయంలో రాజ్యసభ ఎన్నికల నిర్వాహణాధికారి, శాసనసభ అదనపు కార్యదర్శి సుబ్రమణ్యం వద్ద శుక్రవారం నామినేషన్ పత్రాలు సమర్పించారు.

ఆస్తుల వివరాలు... : కాగా, కమల్‌హాసన్ సమర్పించిన నామినేషన్ పత్రంలో ఆయన ఆస్తి విలువ మొత్తం రూ.305కోట్లు ఉందని తెలిపారు. తనపేరుతో రూ.245.86 కోట్ల స్థిరాస్తులు, రూ.59.69 కోట్ల చరాస్తులున్నట్లు తెలిపారు. రుణం రూ.49.67 కోట్లు ఉందని చూపించారు. ప్రస్తుతం ఆళ్వార్‌పేటలో రెండు, ఉద్దండి, షోలింగనట్లూరులో తలా ఒకటి చొప్పున నాలుగు వాణిజ్య భవనాలున్నాయని, వీటి విలువ రూ.111.01 కోట్లు కాగా, దిండుగల్‌లోని పట్టిగ్రామంలో రూ.22.24 కోట్ల విలువైన వ్యవసాయ భూములున్నట్లు తెలిపారు. రోజువారి ఖర్చుల నిమిత్తం రూ.2.60 లక్షలుందని, రూ.8.43 కోట్ల విలువైన మహేంద్రా బొలేరో, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, లక్సస్ బ్రాండ్ లగ్జరీ కారులు ఉన్నట్లు కమల్ తన నామినేషన్ పత్రాల్లో తెలిపారు.

న్యాయవాది విల్సన్... : డీఎంకే అభ్యర్థి న్యాయవాది పి.విల్సన్ తనపేరు మీద రూ.12.58 కోట్ల ఆస్తులు, రూ.28.21 కోట్ల స్థిరాస్తులు, తన భార్య పేరుతో రూ.3.27 కోట్ల చరాస్తులు, రూ.11.72 కోట్ల విలువైన స్థిరాస్తులున్నట్లు తెలిపారు. వీరిద్దరి పేరుతో ఖాతా ఉన్న బ్యాంకు నుంచి రూ.1.15 కోట్లు రుణం పొందినట్లు తెలిపారు.

సల్మా.. : అదేవిధంగా డీఎంకే అభ్యర్థి సల్మా తన పేరుతో రూ.90.09లక్షల విలువగల స్థిరాస్తులు, ఆమె భర్త పేరిట రూ.55.42 లక్షలు మొత్తం రూ.1.98 కోట్ల ఆస్తులున్నట్లు తెలిపారు.

ఎస్ఆర్ శివలింగం... : మరో డీఎంకే అభ్యర్థి ఎస్ఆర్ శివలింగం రూ.76.04 లక్షల ఆస్తులు, రూ.1.34.06 స్థిరాస్తులు ఆయన భార్య పేరిట రూ.1.64 కోట్ల ఆస్తులున్నాయి. శివలింగంకు రూ.64.30 లక్షల రుణం, ఆయన భార్య రూ.2.05 లక్షల రుణాలున్నాయి.

ఇన్బదురై... : అన్నాడీఎంకే అభ్యర్థి ఇన్బదురై మొత్తం ఆస్తుల విలువ రూ.5.21 కోట్లు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు రూ.2.68 కోట్ల విలువైన ఆస్తులు, రూ.2.54 కోట్ల విలువైన స్థిరాస్తులు (భూములు) ఉన్నాయి. కాగా, ఇన్బదురైకు రూ.1.31 కోట్లు బ్యాంకు నుంచి రుణంగా పొందారు.

ఎం.ధనపాల్.. : అన్నాడీఎంకే అభ్యర్థి ఎం.ధనపాల్ మొత్తం ఆస్తి విలువ రూ.26.33 కోట్లు ఇందులో రూ.9.99 కోట్లు చరాస్తులు కాగా,వాణిజ్య భవనాలు, గృహసముదాయా విలువ రూ.16.34 కోట్లు. ఆయన భార్య పేరుతో బ్యాంకునుండి రూ.3.32 కోట్లు రుణం పొందినట్లు నామినేషన్ పత్రంలో తెలిపారు.



సత్యమంగళం రోడ్డులో ఏనుగు సంచారం

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం తింబం ఘాట్‌రోడ్డు రెండో మలుపు వద్ద అడవి ఏనుగు సంచరిస్తుండటంతో ఆ మార్గంలో వెళ్లే వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. మలుపు వద్దే నిలిచిన ఆ ఏనుగు అక్కడి వచ్చే వాహనాలను అడ్డుకోవడంతో డ్రైవర్లు వాహనాలను వెనక్కి మళ్లిస్తున్నారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు తింబం ప్రాంతం వద్ద అడవి ఏనుగుల సంచారం ఉంటోందని చెప్పారు. ఏనుగులు ఆహారం, నీటి కోసం వెదుక్కుంటూ జనావాస ప్రాంతాలకు వస్తున్నాయని తెలిపారు. తింబ ఘాట్ రోడ్డు వద్దనున్న అడవి ఏనుగును తరిమికొట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్రవాహన చోదకులు ఎట్టి పరిస్థితుల్లోనూ తింబరం ఘాట్‌రోడ్డులోకి వెళ్ళకూడదని హెచ్చరించారు.

గజ దాడిలో వృద్ధుడి మృతి

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో వృద్ధుడు మృతిచెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈరోడ్‌కు చెందిన గణేశన్ (70) శుక్రవారం తన పశువులను మేత కోసం సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఆ సమయంలో పొదల చాటు నుంచి వచ్చిన ఏనుగు గణేశన్‌పై దాడి చేసింది. ఏనుగు నుంచి తప్పించుకునే ప్రయత్నంలో గణేశన్ కేకలకు చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న వారు అక్కడకు చేరుకుని పెద్దగా శబ్దాలు చేస్తూ ఏనుగును అడవిలోకి తరిమారు. తీవ్రగాయాలైన గణేశన్‌ను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక శనివారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వర్క్‌షాప్‌లో అగ్నిప్రమాదం

- సహాయక చర్యల్లో మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ సమీపంలోని ఓ లారీ వర్క్‌షాపులో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. నామక్కల్ సమీపం వళ్ళిపురంలో ముత్తు పాత ఇనుప సామాన్ల దుకాణం, లారీ వర్క్‌షాపు నడుపుతున్నాడు. శనివారం వేకువజాము ఆ వర్క్‌షాపు ముందున్న పాత లారీల విడిభాగాల నుండి ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు పెరిగి ఆ ప్రాంతమంతటా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి సుబ్రమణ్యం పరమత్తివేలూరుకు వెళ్తూ వర్క్‌షాప్ నుంచి వస్తున్న మంటలను గమనించి, వెంటనే కారు ఆపి ప్రమాద స్థలానికి వెళ్ళారు. అప్పటికే రెండు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పుతున్నారు. మంత్రి సుబ్రమణ్యం వారి వద్దకు వెళ్ళి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సుమారు గంటసేపు అగ్నిమాపక సభ్యులు పోరాడి మంటలను ఆర్పివేశారు. ఆ తర్వాత మంత్రి సుబ్రమణ్యం అగ్నిమాపక దళం స్బిబందికి ధన్యవాదాలు తెలిపారు. రహదారిలో నిలిపి ఉంచిన వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను వీలయినంత త్వరగా క్లియర్ చేయమని ఆదేశించారు. ఆ తర్వాత ఆయన కారులో పరమత్తివేలూరుకు బయలుదేరారు.



సహాయ చర్యల్లో పాల్గొన్న మంత్రి సుబ్రమణ్యం

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా అంబత్తూర్ పరిధిలోని 6వ వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, కామరాజర్ నగర్, మహాత్మాగాంధీ 1 నుంచి 9 వీధులు, 3వ మెయిన్ రోడ్డు, వాటర్ ట్యాంక్, సౌత్ ఫేస్ 6 నుంచి 9వ సౌత్ ఫేస్, 3వ క్రాస్ వీధి, 2వ మెయిన్ రోడ్డు, 2వ క్రాస్ వీధి, 9 నుంచి 11 క్రాస్ వీధులు, డివిజన్ 1 సౌత్ ఫేస్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు మరుదమలైకు భక్తుల వాహనాల నిషేధం

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ సమీపం మరుదమలై సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం వైకాశి విశాఖం జరుగనుంది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి రానున్నారు. ఈ క్రమంలో, భద్రత, రద్దీ నియంత్రించేలా ఈ నెల 9వ తేది మరుదమలై కొండ మార్గంలో ద్విచక్ర, నాలుగు వాహనాల్లో భక్తులు వెళ్లేందుకు నిషేధం విధించారు. అందువల్ల భక్తులు మెట్ల మార్గం, ఆలయం తరపున ఏర్పాటుచేసిన బస్సుల్లో మాత్రమే స్వామి దర్శనానికి వెళ్లాలని ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి మహిళల ప్రత్యేక గ్రీవెన్స్

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీచ్ రైల్వేస్టేషన్ సమీపంలోని కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 9,10వ తేదీల్లో మహిళల ప్రత్యేక గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు టిలేనాకొండుప్ నేతృత్వంలో 'మహిళా జన సున్వై' పేరుతో రెండు రోజుల మహిళల ప్రత్యేక గ్రీవెన్స్ జరుగనుందని తెలిపారు. చెన్నై జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, వ్యక్తిగతంగా స్వీకరించిన ఫిర్యాదులను జాతీయ మహిళా కమిషన్‌లో నమోదు చేసిన ఫిర్యాదులుగా పరిగణిస్తామని తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో సోమ, మంగళవారాల్లో ఉదయం 10 గంటల నుంచి గ్రీవెన్స్ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

9,12 తేదీల్లో చెన్నై-గుమ్మిడిపూండి రైళ్ల పాక్షిక రద్దు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్ కవర పేట-గుమ్మిడిపూండి మార్గంలో మరమ్మతుల కారణంగా ఈ నెల 9,12 తేదీల్లో పలు రైల్లు రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి, చెన్నై బీచ్-గుమ్మిడిపూండి, చెన్నై సెంట్రల్-సూళ్లూరుపేట, సూళ్లూరుపేట-నెల్లూరు, నెల్లూరు-సూళ్లూరుపేట మధ్య ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 3.20 గంటల వరకు పలు సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 10.30 గంటలకు పొన్నేరి, 11.35 గంటలకు మీంజూరుకు, చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు పొన్నేరి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. అలాగే, పొన్నేరి నుంచి మధ్యాహ్నం 1.18, 3.33, మీంజూరు నుంచి మధ్యాహ్నం 2.59 గంటలకు చెన్నై సెంట్రల్‌కు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ప్రత్యేక స్వయం సహాయక సంఘాలకు రూ.3 కోట్లు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రత్యేక స్వయం సహాయక సంఘాలకు జీవనాధార నిధిగా రూ.3.45 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు మహిళాభివృద్ధి సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... గిరిజనులు, పేదలు, హిజ్రాలతో కూడిన 23 ప్రత్యేక స్వయం సహాయక సంఘాలకు రూ.23 లక్షలు, 227 వృద్ధులతో కూడిన స్వయం సహాయక సంఘాలకు రూ.2.27 కోట్లు, 95 దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు రూ.95 లక్షల చొప్పున మొత్తం 345 ప్రత్యేక స్వయం సహాయక సంఘాలకు జీవనోపాధి నిధిగా రూ.3.45 కోట్లు విడుదల చేశారు. ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న జీవనోపాధి నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

ఉత్తర చెన్నై అభివృద్ధి ప్రాజెక్ట్‌లో పోలీసు శాఖకు రూ.54.36 కోట్లు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఉత్తర చెన్నై అభివృద్ధి ప్రాజెక్ట్ కింద ప్రజా భద్రత, పోలీసు సంక్షేమం కోసం రూ.54.36 కోట్లు కేటాయించింది. ఆ ప్రకారం, ఉత్తర చెన్నైలోని 45 ప్రాంతాల్లో ఏఎన్‌పీఆర్ కెమెరాల ఏర్పాటుకు రూ.9.16 కోట్లు, పోలీసు పెట్రోలింగ్ కోసం 60 కొత్త ద్విచక్రవాహనాల కొనుగోలుకు రూ.90.6 లక్షలు, పోలీసు బాలురు, బాలికల క్లబ్‌ల ఏర్పాటుకు రూ.60 లక్షలు, మాదకద్రవాలకు బానిసైన వారికి చికిత్స పునరావాస కేంద్రాల ఏర్పాటుకు రూ.2.95 కోట్లు కేటాయించారు. అలాగే, పోలీసు హాస్టళ్ల నిర్మాణానికి రూ.9.75 కోట్లు, కొళత్తూర్, పెరవళ్లూర్ పోలీస్‌స్టేషన్లకు కొత్త భవనాల నిర్మాణానికి రూ.15 కోట్లు చొప్పన పోలీసు శాఖకు సంబంధించి మొత్తం 7 ప్రాజెక్ట్‌లకు రూ.54.36 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

మద్రాసు వర్సిటీలో ఎంఏ (తెలుగు)లో దరఖాస్తుల ఆహ్వానం

టి.నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఎంఏ (తెలుగు) కోర్సుల్లో అడ్మిషన్లకు జూలై 7 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆ శాఖ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్యా విస్తాలి శంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. మద్రాసు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పీజీ అడ్మిషన్ల విభాగాన్ని సందర్శించి ఈ కోర్సుకు సంబంధించిన దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించాలని, ఆ తర్వాత ఆ దరఖాస్తు నకలు తీసుకుని విద్య, తదితర అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లన జతచేసి 'డా. విస్తాలి శంకరరావు, తెలుగు శాఖాధిపతి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై -600005' అనే చిరునామాకు పంపాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, తదితర వివరాలకు https://egovernance.unom.ac.in/cbCS2526/ https://egovernance.uno m.ac.in/cbCS2526/AdmissionPGMPHIL/FrmInsruct.aspxq అనే వెబ్‌సైట్‌లను సందర్శించాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం ఆచార్య విస్తాలి శంకరరావు (9445203041), డా. పాండురంగం కాళియప్ప (9701869674), డా. మాదా శంకరబాబు (7200685477)ను సంప్రదించవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కయిత్తారు సమీపం అయ్యనార్‌ఊత్తు గ్రామంలోని సబ్ స్టేషన్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయి. శనివారం వేకువజాము సబ్ స్టేషన్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గాలి బలంగా వీయడంతో పక్కనే ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వ్యాపించాయి. ఇలా ఒకే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు మంటల్లో దగ్ధమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న తిరునల్వేలి జోన్ అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో హుటాహుటిన అక్కడికి చేరుకుని ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల దాకా పోరాడి మంటలను ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్మశానవాటిక ఆక్రమణ

● నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా మోడకుర్చి సమీపంలో శ్మశానాన్ని ఆక్రమించి, మృత దేహాలకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఈరోడ్ జిల్లా కలెక్టర్‌కు, తమిళనాడు ఆదిద్రావిడ, గిరిజనుల కమిషన్ ఆదేశించింది. మోడకుర్చి తాలూకా కన్నుడయంపాళయం గ్రామంలో సుమారు 700 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరు వినియోగించే శ్మశానవాటికలోకి కొంత ప్రాంతాన్ని, ఇతర సామాజికవర్గానికి చెందిన ఒకరు ఆక్రమించి, శ్మశానానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఈ ప్రాంత దళితులు వాపోతున్నారు. ఈ వ్యవహారంపై తమిళనాడు ఆదిద్రావిడ, గిరిజన కమిషన్ అధ్యక్షుడు, న్యాయమూర్తి తమిళ్‌వానన్, సభ్యులు ఆనందరాజా, ఇళంచెలియన్ తదితరులు సుమోటాగా కేసు నమోదుచేసి విచారించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి జూలై 25వ తేదిలోపు నివేదిక అందజేయాలని ఈరోడ్ జిల్లా కలెక్టర్‌కు కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది.

అవినీతికి పాల్పడుతున్న ఐదుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): లంచం ఆశించడం సహా పలురకాల అవినీతికి పాల్పడుతున్న ఐదుగురు పోలీసులను కోవై నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న పలువురు పోలీసులు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల నుంచి లంచం తీసుకోవడం, నేరారోపణ ఎదుర్కొంటున్న వారితో సఖ్యతగా ఉండడంతో పాటు అవినీతికి పాల్పడుతున్నారంటూ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులందాయి. ఈ వ్యహారంపై చేపట్టిన విచారణ నివేదిక ఆధారంగా, లంచం తీసుకోవడం, అవినీతికి పాల్పడడం తదితరాలు చేస్తున్న వడవెల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మణికంఠన్, సెల్వపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ వడివేలు, పోత్తనూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న గఫూర్, వినోద్, వెరైటీ హాల్ రోడ్డు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మహారాజన్‌లను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ శరవణసుందర్ ఉత్తర్వులు జారీచేశారు.

వంతెన నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు

తిరుత్తణి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మండలం పొదటూర్‌పేటలోవున్న నంది నదిపై వంతెన నిర్మాణానికి శనివారం ఉదయం ఎమ్మెల్యే ఎస్. చంద్రన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో వరద ఉధ్రుతి ఎక్కువ కావడంతో చుట్టుపక్కల ఉన్న సుమారు 60 గ్రామాలకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా, రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి రూ.7.40కోట్లు ఈ బ్రిడ్జి నిర్మాణానికి విడుదల చేశారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారానికి చూపుతోందని ఎమ్మెల్యే చంద్రన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుత్తణి మండల కార్యదర్శి కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

● స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు

వేలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు పరిసర ప్రాంతాలకు సుమారు 5వేల చెట్లను పంపిణీ చేయనున్నట్లు స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. వేలూరు సమీపంలోని తిరుమలై కోటీనారాయణి పాఠశాల నిర్వాహకులు శనివారం ఉదయం 5వేల చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, శ్రీపురం శ్రీపురం స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరై చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో వేలూరు డీఎస్పీ పృథ్విరాజ్ చౌహాన్, సమాజసేవకుడు రాజాబాబు, నారాయణి పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వాళప్పాడి ఫ్లైఓవర్ పై ప్రమాదం

● ముగ్గురి మృతి, నలుగురికి గాయాలు

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా వాళప్పాడి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆరుగురు శనివారం మధ్యాహ్నం సేలం నగరానికి కారులో బయలుదేరారు. ఆ కారు సేలం - చెన్నై జాతీయ రహదారిలో వెళ్తుండగా అదుపు తప్పి ఫ్లైఓవర్ పిట్టగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణించిన ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తక్కిన నలుగురు గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన నలుగురిని కారులో నుంచి వెలికి తీసి, చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కడలూరులో కొవిడ్ లక్షణాలతో వృద్ధుడి మృతి

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా పన్రుట్టి వద్ద కొవిడ్ లక్షణాలతో తీవ్ర అస్వస్థతకు గురైన వృద్ధుడు (75) మృతి చెందారు. జిల్లాకు చెందిన వృద్ధుడు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ చికిత్సకోసం ఆస్పత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించగా, ఆ వృద్ధుడికి కొవిడ్ లక్షణాలున్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందించారు. శనివారం ఉదయం చికిత్స ఫలించక ఆయన మృతిచెందాడు. ఆరోగ్య శాఖ సిబ్బంది సాయంతో ఆ వృద్ధుడి అంత్యక్రియలు జరిగాయి.

విషం కలిపిన మద్యం తాగి తండ్రి మృతి

● కుమారుడి పరిస్థితి విషమం

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా పునల్‌వాసల్ ప్రాంతంలో కొడుకు దాచిన మద్యంలో విషం కలిపిన విషయం తెలియక దానిని తాగి తండ్రి మరణించాడు. పునల్‌వాసల్ ప్రాంతానికి చెందిన కన్నన్ (52)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమారుడు కదిరవన్ (21) కాట్టుకోటలో కార్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కదిరవన్‌కు మద్యం అలవాటు ఉంది. ప్రతిరోజు మద్యం కొనుగోలు చేసి, సగం తాగి, మిగతా మద్యాన్ని తన బైక్ కవర్‌లో దాచి ఉంచుతాడు. కదిరవన్ తండ్రి కన్నన్‌కు కూడా మద్యం అలవాటు ఉంది. ఒకరోజు కుమారుడు బైక్‌లో మద్యం దాచటం గమనించిన కన్నన్, కుమారుడు వెళ్లిన తర్వాత బాటిల్‌లోని కొంత మద్యం తాగి అందులో నీరు కలిపి మళ్ళీ బైక్ కవర్‌లో పెట్టేవాడు. రోజూ తండ్రీకొడుకులకు ఇదే అలావాటుగా మారింది. గురువారం రాత్రి యధావిధిగా బైక్ కవర్‌లో కొడుకు దాచిన సీసాలోని మద్యం తాగిన కన్నన్, అందులో నీళ్లు కలిపి ఉంచాడు. కొద్దిసేపయ్యా కదిరవన్ బైక్ వద్దకు వెళ్ళి సీసాలోని మద్యాన్ని తాగి ఇంటిలోపలకు వచ్చి పడుకున్నాడు. పావు గంట దాటగానే కదిరవన్ ఉన్నట్టుండి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని ప్రశ్నించగా, 'తాగుబోతుగా ఉన్న తనకు ఎవరూ పిల్లనివ్వడం లేదని, ఆ దిగులతో ఆత్మహత్య చేసుకోవాలని విషం కలిపిన మద్యం తాగినట్లు చెప్పాడు. కుమారుడి మాటలు విన్న కన్నన్ దిగ్భ్రాంతి చెందాడు. బైక్‌లో ఉంచిన మద్యాన్ని తానుకూడా తాగినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే తండ్రీకొడుకులను చికిత్స నిమిత్తం ఆత్తూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక తండ్రి కన్నన్ మృతిచెందాడు. కదిరవన్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్సలు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై గంగవెల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

చట్టనాథుడి ఆలయంలో ఓపీఎస్ తనయుడి పూజలు

టి.నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా సీర్గాళిలో ధర్మపురం ఆధీనం ఆధ్వర్యంలోని చట్టనాథ స్వామివారి ఆలయంలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రత్యేక పూజలో మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) తనయుడు జయప్రదీప్ పాల్గొన్నారు. ఈ ఆలయంలోని స్వామివారిని దర్శించుకుంటే కోర్టు కేసులు పరిష్కారమవుతాయని చెబుతారు. ప్రతి శుక్రవారం సాయంత్రం నుండి శనివారం వేకువజాము వరకు శత్రుసంహార పూజలు జరుగుతాయి. ఈ పూజల కోసం రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు తరలివస్తారు. పూజల తర్వాత ఆలయ తరపున శివాచార్యులు చట్టనాథ స్వామివారి పునుగు విభూతి, మినప వడ, పాయసం తదితరాలను ప్రసాదంగా అందజేశారు.



సీర్గాళి చట్టనాథ ఆలయంలోకి వెళుతున్న జయప్రదీప్

వేదారణ్యంలో జోరుగా ఉప్పు ఉత్పత్తి

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తూత్తుకుడి తర్వాత అధికంగా ఉప్పు తయారు చేసే ప్రాంతమైన వేదారణ్యంలో ప్రస్తుతం ఎండలు బాగాఉండటంతో ఉప్పు తయారీ పనులు చురుకుగా జరుగుతున్నాయి. వేదారణ్యంలోని అగస్తియన్ పళ్ళి, కోడియక్కాడు, కటినెల్‌వయల్ తదితర ప్రాంతాల్లో సుమారు 9 వేల ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. ఈ ఉప్పు తయారీలో ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 10 వేల మంది కార్మికులు పాల్గొంటున్నారు. ప్రతియేటా ఈ ప్రాంతంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అవుతుంది. ఇక్కడ నుంచి ఉప్పును రాష్ట్రం నలుమూలలకే కాకుండా ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు కూడా ఎగుమతవుతున్నాయి. ప్రస్తుతం టన్ను ఉప్పు ధర రూ.2000ల నుండి రూ.2500ల దాకా విక్రయిస్తున్నారు.



వేదారణ్యం వద్ద ఉప్పు సాగుచేస్తున్న రైతులు

ఘనంగా తీర్థగిరి ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకంలో ఆలయ నిర్వాహకులు

వేలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పుదువనం సమీపంలోవున్న తీర్థగిరి మురుగన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు శనివారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని 92 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం దీపారాధన తరువాత పుదియ నీతి కట్చి అధ్యక్షుడు ఏపీ షణ్ముగం ఆధ్వర్యంలో శివాచార్యులు గోపుర కలశాలపై పవిత్రజలాలతో సంప్రోక్షించారు. ఈ వేడుకలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మంత్రి తనిఖీలు



ఆస్పత్రి నిర్వాహణను పరిశీలిస్తున్న మంత్రి ఈవీ వేలు

వేలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని ప్రభుత్వ జనరల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని శనివారం రాష్ట్రప్రజా పనులశాఖ మంత్రి ఈవీ వేలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, ఆస్పత్రి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, కలెక్టర్ సుబ్బులక్ష్మి, మేయర్ సుజాత, ఇంజనీర్లు మణివన్నన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని కాట్పాడి ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో శనివారం ఉదయం మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేలూరు కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, విద్యార్థి దశలోనే వీటికి దూరంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి దయాళన్, డాక్టర్ శివాజీ, డ్రగ్స్ నియంత్రణా అధికారి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగపై నాగరాజు

● భక్తుల పరవశం

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కూడలూరు తామరైకుళం శివాలయంలోని శూలాయుధంపై నాగరాజు నిల్చున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి. తామరైకుళం శివాలయంలో ప్రతి శుక్రవారం నాగుపాము ప్రవేశించి, శివలింగాన్ని దర్శనం చేసుకుంటుందని ఆ ప్రాంత ప్రజలు చెబుతుంటారు. ఆ ప్రకారం, శుక్రవారం ఆలయ పూజారులు, భక్తులు నాగరాజు కోసం ఎదురుచూశారు. సాయంత్రం 6 గంటల సమయంలో గర్భగుడిలో ప్రవేశించిన నాగుపాము, శివుడు విగ్రహం పైకెక్కి, శూలాయుధంపై కొద్దిసేపు నిలబడింది. దానిని కొందరు భక్తులు వీడియోగా చిత్రీకరించారు. కొద్దిసేపటి అనంతరం పాము గర్భగుడి నుంచి బయటకు వచ్చి సమీపంలోని పొలాల్లోకి వెళ్లిపోయింది.



శివలింగంపై నాగరాజు

బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

వేలూరు, జూన్ 7: స్థానిక ఆర్ఎన్ పాళ్యంలోని ఈద్గా మైదానంలో శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా సుమారు 5వేల మంది ముస్లింలు నమాజులో పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా పేదలకు ఖుర్బానీ అందజేశారు. అలాగే, జిల్లాలోని పల్లికొండ, పేర్నాంబట్టు, గుడియాత్తం, వాణియంబాడి ఖాదర్‌పేట ఈద్గా మైదానం సహా పలు ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు

గంగమ్మ జాతరలో అన్నదానం

వేలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా సత్తువాచారి గంగమ్మ జాతర సందర్భంగా శనివారం ఉదయం నుండే అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన అమ్మవారి శిరస్సు ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణ్, ముకేష్, హరీష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

లారీ ఢీకొని ఇద్దరి మృతి

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రసాయనాల (యాసిడ్) లోడుతో వస్తున్న లారీ ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన చెంగల్పట్టు జిల్లాలో చోటు చేసుకుంది. కల్పాక్కం సమీపంలో వస్తున్న లారీ హఠాత్తుగా అదుపుతప్పి సైకిల్‌ను ఢీకొని, రోడ్డుపై ఒరిగిపోయింది. ఈ ఘటనలో సైకిల్‌పై వెళుతున్న వాయలూరుకు చెందిన దురై, వెలియూర్‌కు చెందిన మరో వ్యక్తి తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. అదే సమయంలో లారీ ట్యాంక్ నుంచి యాసిడ్ బయటకు రావడంతో స్థానికులు హడలిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది యాసిడ్‌పై నీళ్లు చల్లి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు.

ఆగి ఉన్న కారులో మతబోధకుడి మృతదేహం

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలో ఖాళీ ప్రాంతంలో ఆగి ఉన్న కారులో మతబోధకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలో మధురాంతకం కిలియాట్రు వంతెన సమీపంలోని ఖాళీ ప్రదేశంలో శుక్రవారం సాయంత్రం నుంచి ఓ కారు ఉంది. ఈ ప్రాంతానికి చెందిన వారు కారులో చూడగా, ఒక వ్యక్తి స్పృహతప్పి పడి ఉన్నట్లు గుర్తించి మధురాంతకం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని కారు అద్దాలు పగులగొట్టి పరిశీలించగా, కారులోకి వ్యక్తి మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహం పక్కనే మద్యం బాటిల్, వాటర్ బాటిల్ లభ్యమయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోలీసులు విచారణ జరపగా.. మృతుడు మేల్‌మరువత్తూర్ సమీపం అగిలి గ్రామానికి చెందిన అమల్‌రాజ్ (42) అని, ఉత్తమనల్లూర్ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఘటన జరిగిన రోజు అధికంగా మద్యం సేవించి కారులో చెన్నై వైపు వస్తున్న అమల్‌రాజ్, కిలాయాట్రు వంతెన సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కారు ఆపి, డోర్లు మూసివేసి నిద్రపోయినట్లు, శ్వాసతీసుకోలేక నిద్రలోనే మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

ఆలయ వేడుకల్లో అపశ్రుతి

● ఒకరి మృతి, నలుగురికి గాయాలు

పెరంబూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కడలూరు తాలూకా రెడ్డిచావిడి సమీపంలో స్వామివారి ఊరేగింపు సమయంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. చిన్నఇరుసాంపాళయం గ్రామంలో ముత్తుమారియమ్మన్ ఆలయ వేడుకలు జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించే కార్యక్రమం జరిగింది. స్వామివారి పల్లకీని ఐదుగురు భక్తులు ఎత్తుకొని వెళ్తుండగా తక్కువ ఎత్తులో వెళుతున్న విద్యుత్ తీగకు పల్లకి తగిలింది. దీంతో, విద్యుదాఘాతానికి గురై పుదుచ్చేరి అరియాంకుప్పం మనవెలి పెరియార్ నగర్‌కు చెందిన కర్నాచంద్రన్ (40) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అలాగే, శివమణి, కన్నన్, మురుగయ్యన్, శ్రీవేష్‌లకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని వెంటనే పుదుచ్చేరి జిప్మర్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై రెడ్డిచావిడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పేదల వైద్యుడు కనకరత్తినం కన్నుమూత

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పట్టుకోటలో 'రూ.10ల డాక్టర్‌గా పేరుగడించిన పేదల వైద్యుడు టిఏ కనకరత్తినం అలియాస్ టీఏకే రత్తినం పిళ్లై(96) శనివారం వేకువజాము తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. తన సుదీర్ఘ వైద్య సేవలో సిజేరియన్ ఆపరేషన్లు వెలుగు చూడని కాలం నుంచి ఇప్పటి వరకు ఆయన సుమారు 65వేలకు పైగా సుఖ ప్రసవాలు చేసి పట్టుకోటలో కీర్తిగడించారు. పట్టుకోట నగరంలో ఆయన పేదలనుండి రూ.10లను మాత్రమే ఫీజు తీసుకుని చికిత్స చేసేవారు. పట్టుకోట చుట్టుపక్కల ఉన్న 50 గ్రామాల్లోని నిరుపేదలకు వైద్యం అందించారు. నిరుపేదలు చికిత్స కోసం వస్తే వారికి తన సొంత ఖర్చు తోనే అత్యవసరమైన మందులను కూడా కొనిచ్చేవారు. ఇంతటి కీర్తి ప్రతిష్ఠలను పొందిన డాక్టర్ టీఏకే రత్తినం పిళ్లై మృతివార్త విని పట్టుకోట నగర వాసులు, ఆయన దగ్గర చికిత్స పొందిన వేలాదిమంది దిగ్భ్రాంతి చెందారు. పట్టుకోట శీనివాసపురంలోని నివాసగృహంలో ఆయన మృతదేహాన్ని ప్రజల సందర్శన కోసం ఉంచారు. డాక్టర్ రత్తినం అంత్యక్రియలు ఆదివారం 11 గంటలకు జరుగుతుందని కుటుంబీకులు తెలిపారు.



డాక్టర్ కనకరత్తినం (ఫైల్‌ఫొటో)

పారిశుధ్య కార్మికురాలిపై అత్యాచారం

పూజారిపై కేసు నమోదు

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని ఓ ఆలయంలో పారిశుధ్య పనులు చేస్తున్న యువతి (28)ని పెళ్ళి చేసుకుంటానని మోసగించి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే నేరారోపణలపై ఆ ఆలయ పూజారి త్యాగరాజన్ (40)పై పోలీసులు కేసు నమోదు చేశారు. యేడాది పాటు సేవాభావంతో ఆలయంలో పారిశుధ్య పనులు చేసేందుకు వచ్చిన ఆ యువతిని పెళ్ళి చేసుకుంటానని త్యాగరాజన్ మాయమాటలు చెప్పి ఆమెపై పలుమార్లు అత్యాచారాలకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ కేసు విచారణను ఆంబూరు మహిళా పోలీసులకు బదిలీ చేస్తూ ఎస్పీ శ్రేయా గుప్తా ఉత్తర్వు జారీ చేశారు.



పూజారి త్యాగరాజన్

చికెన్ రైస్ తిని బాలుడి మృతి

తిరుత్తణి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చికెన్ రైస్ తిన్న ఓ బాలుడు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన పళ్లిపట్టులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని పెద్దపాళయంలో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న సురేంద్రర్‌కు 9వ తరగతి చదువుతున్న భరత్ (13)అనే ఒక కుమారుడున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తన కుమారిడి కోసం సమీపంలోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో చికెన్‌రైస్ కొని, ఇంటికి తీసుకెళ్ళాడు. ఈ క్రమంలో ఆ చికెన్‌రైస్ తిన్న భరత్ అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురైయ్యాడు. వెంటనే తన కుమారుడిని దగ్గరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స ఫలించక ఆ బాలుడు మృతిచెందాడు. ఆ బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించి, దీనిపై కేసు నమోదు చేసి విచారణ చర్యలు చేపట్టారు.



భరత్ (ఫైల్‌ఫొటో)



వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు?

గత కొంతకాలంగా తన సినీ కెరీర్‌పై ప్రత్యేక దృష్టిసారించిన హీరో శింబు జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వంలో నటించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఆయన కమల్ హాసన్ 'థగ్ లైఫ్'లో ఓ కీలక పాత్ర పోషించిన విషయం తెల్సిందే. ఈ నెల 5వ తేదీన విడుదలైన ఈ మూవీ హిట్ టాక్ తెచ్చుకుంది. ఇకపై తాను కమిట్ అయిన చిత్రాలను పూర్తి చేసేందుకు శింబు సిద్ధమయ్యారు. వీటిలో ముందుగా 'పార్కింగ్' ఫేం రామ్‌కుమార్ బాలకృష్ణన్ డైరెక్షన్‌లో నటించనున్నారు. ఇది శింబు నటించే 49వ చిత్రం. ఆ తర్వాత దేశింగు పెరియస్వామి దర్శకత్వంలో 50వ చిత్రాన్ని, 'డ్రాగన్' ఫేం అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో 51వ చిత్రంలో నటించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ భారీ బడ్జెట్‌తో ఈ మూవీ నిర్మించనుంది. ఈ మూడు చిత్రాలను పూర్తి చేసిన తర్వాత వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు నటించనున్నట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. అయితే, ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన వెలువడాల్సివుంది.

తస్మాత్ జాగ్రత్త ...
అక్షర హాసన్ వినతి



తన అభిమానులతో పాటు ఔత్సాహిక కళాకారులకు అగ్ర నటుడు కమల్ హాసన్ చిన్న కుమార్తె అక్షర ఓ హెచ్చరిక చేశారు. తన పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని అందువల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్‌ఐ) పేరుతో అనేక మంది మోసాలకు పాల్పడుతున్నట్టు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇదే విషయంపై ఆర్‌కేఎఫ్‌ఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆర్‌కేఎఫ్‌ఐ డైరెక్టర్లలో ఒకరైన అక్షర హాసన్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్టు వార్తలు రావడంతో ఆమె స్పందించారు. ఈ విషయంపై ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'ఇబ్రహీం అక్తర్ అనే వ్యక్తి నా పేరు, నా కుటుంబ సభ్యుల పేర్ల చెప్పి ఊటీలో ఓ కార్యాలయం ప్రారంభించి, సినీ నిర్మాణాలు చేస్తునట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. ఆయన చేసే ప్రచారానికి నాకు, మా కుటుంబ సభ్యులకు, మా నిర్మాణ సంస్థకు ఎలాంటి సంబంధం లేదు. ఈ అంశంపై తగిన చర్యలు చేపడుతున్నాం. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

స్టూడియో ప్రారంభించిన రవి మోహన్



నిర్మాత 'ఎడిటర్' మోహన్ తనయుడిగా చిత్రపరిశ్రమకు పరిచయమైన రవి మోహన్ (జయం రవి) గత 23 యేళ్ళుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. గత కొన్ని నెలలుగా తన వైవాహిక బంధంలోని సమస్యలను ఎదుర్కొంటున్నారు. తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఈ కేసు ఫ్యామిలీ కోర్టులో సాగుతోంది. ఇటీవల తన పేరు కూడా జయం రవి నుంచి రవి మోహన్‌గా మార్చుకుని ఇకపై కొత్త జీవితాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. ఇందులో భాగంగా, త్వరలోనే దర్శకుడిగా అవతారమెత్తనున్నారు. తన తొలి చిత్రాన్ని ప్రముఖ హాస్య నటుడు యోగిబాబుతో రూపొందించనున్నారు. ఇదిలావుంటే, తన పేరుమీద 'రవి మోహన్' అనే స్టూడియో పారంభించారు. ఈ స్టూడియోపై వరుసగా చిత్రాలు నిర్మించనున్నట్టు రవి మోహన్ వెల్లడించారు.

చిత్రజ్యోతి

హైకోర్టు తీర్పుపై అప్పీల్
● విశాల్ మంతనాలు?



లైకా ప్రొడక్షన్స్‌కు చెల్లించాల్సిన రుణం కేసులో నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్‌కు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. తీసుకున్న రుణానికి 30 శాతం వడ్డీతో కలిసి చెల్లించాలని తాజాగా మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఈ తీర్పుతో విశాల్ ఒకింత షాక్‌కు గురయ్యారు. అసలే ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్న విశాల్... ఈ తీర్పుతో ఆయనకు మరిన్ని ఆర్థిక కష్టాలు ఎదురుకానున్నాయి. బడా ఫైనాన్షియర్, సినీ నిర్మాత అన్బుచెళియన్ నుంచి విశాల్ రూ.21.29 కోట్ల రుణాన్ని తీసుకున్నారు. ఈ మొత్తాన్ని అన్బుచెళియన్‌కు లైకా ప్రొడక్షన్ చెల్లించింది. ఆ తర్వాతే లైకాకు అసలు సమస్య మొదలైంది. తమ రుణాన్ని విశాల్ చెల్లించకపోవడంతో లైకా ప్రొడక్షన్ 2021లో కోర్టును ఆశ్రయించింది. గత మూడేళ్ళుగా విచారణ జరిపిన కోర్టు తాజాగా తీర్పును వెలువరించింది. మొత్తం రుణానికి 30 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించింది. అంటే, రూ.21.29 కోట్లకు 30 శాతం వడ్డీ ఒక యేడాదికి సుమారుగా 6 కోట్లు చొప్పున నాలుగేళ్ళకు రూ.24 కోట్లు అవుతుందనీ అసలు, వడ్డీతో కలిసి మొత్తం రూ.45 కోట్ల వరకు చేరుకుంటుందని అంచనా. ఈ మొత్తాన్ని విశాల్ తిరిగి చెల్లించలేని పరిస్థితి. ఇది విశాల్‌కు ఇబ్బందికరమైన విషయం. ఎందుకంటే, నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న విశాల్ గతంలో తమిళ సినీ నిర్మాతల సంఘం అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఒక నిర్మాతగా కష్టాలు తెలిసిన విశాల్.. మరో నిర్మాతకు చెల్లించాల్సిన రుణం తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. పైగా ఈ కేసులో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో అప్పీల్ చేసే విషయంపై న్యాయనిపుణులతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నారు.





● ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లిం సోదరులు



ప్రత్యేక ప్రార్థనల్లో ఇస్లామీయులు



ప్రత్యేక ప్రార్థనల్లో ఇమామ్‌లు





స్థానిక బ్రాడ్‌వే డాన్‌బాస్కో పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఇస్లామీయ మహిళలు

రంజాన్ తర్వాత ముస్లింలు జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. ముస్లింలు జరుపుకునే ప్రతి పండుగకు ఏదోక విశేషం, సందేశం ఉంటాయి. అలాగే బక్రీద్ పండుగ వెనుక ఓ కథనం ఉంది. సమాజంలో చెడు నుంచి ప్రజల్ని మంచివైపు నడిపించడమే. ఇందుకోసమే 'అల్లా ' ఈ భూమి మీదకు 80 మంది ప్రవక్తలను పంపించినట్లు పవిత్ర గంథం ఖురాన్‌లో ఉంది. ఆ ప్రవక్తల్లో ఒకరు హజరత్ ఇబ్రహీం. ఆయన భార్యపేరు హజీరా. వీరికి లేకలేక కలిగిన కొడుకుకి ఇస్మాయిల్ అని పేరు పెట్టుకుని ప్రేమగా పెంచుకుంటారు. ఓ రోజు ఇస్లాయిల్‌ను అల్లాకు బలి ఇస్తున్నట్లు హజరత్ ఇబ్రహీంకు కల వస్తుంది. ఇది అల్లానే తనను ఆదేశించాడని భావించిన హజరత్ కొడుకును బలిచ్చేందుకు సిద్ధపడతాడు. అల్లాపై భక్తితో ఇస్మాయిల్ కూడా తండ్రి కల తెలుసుకుని బలికి సిద్ధపడతాడు. కళ్లకు గంతలు కట్టుకుని కొడుకుని బలి చ్చేందుకు సిద్ధమైన హజరత్ సరిగ్గా ఇస్మాయిల్ మెడపై పడే సమయానికి అల్లా దిగొచ్చి, ఆ స్థానంలో ఓ పొట్టేలును ఉంచుతాడు. అప్పటి నుచి ఏటా బక్రీద్ రోజు పొట్టేళ్లు, మేకలు, గొర్రెలను ఖుర్బానీ పేరుతో బలిస్తున్న ముస్లింలు, ఆ మాంసంలో ఒక వంతు పేదలకు, మరోవంతు బంధుమిత్రులకు, మూడో వంతు తమ కుటుంబ సభ్యులకు పంపిణీ చేసి, త్యాగానికి ప్రతీకగా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటుంటారు. అలాగే ముస్లింలకు అత్యంత పవిత్రమైన మక్కాయాత్ర బక్రీద్ తర్వాతే ప్రారంభం కావడం గమనార్హం. కాగా రాష్ట్ర వ్యాప్తంగా మసీదులు, దర్గాల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. విల్లుపురం కామరాజర్ బాలుర మహోన్నత పాఠశాల ప్రాంగణం, మదురైలోని మసీదులు, మైదానాలు, విరుదాచలం నవాబ్ జానీ అస్మత్ దర్గా మైదానం, పట్టుకోట మసీదు, కోయంబత్తూర్ కరుంబుకడై ఉర్దూ మెట్రిక్యులేషన్ పాఠశాల ప్రాంగణం, కోవై పాత బస్తీలోని టిప్పుసుల్తాన్ మైదానం, తిరుచ్చి, సేలం, తిరునల్వేలి సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి మసీదుల్లో కూడా ఉదయం 6 నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పుదుచ్చేరి బీచ్‌లో నిర్వహించిన ప్రార్థనల్లో ఇస్లామీయులతో పాటు పలు రాజకీయపార్టీల నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన చిన్నారులు, మహిళలు

కుట్రాలం వద్ద పెరిగిన పర్యాటకుల సందడి



కుట్రాలం జలపాతం వద్ద స్నానం చేస్తున్న పర్యాటకులు

టి.నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలో నాలుగు రోజుల క్రితం వరకు కురిసిన భారీ వర్షాలకు కుట్రాలంలోని జలపాతాల వద్ద నీటి ఉధృతి అధికమవటంతో పర్యాటకులను స్నానానికి అనుమతించలేదు. ప్రస్తుతం జలపాతాల చుట్టుపక్కల తేలికపాటి జల్లులు మాత్రమే పడుతుండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. దీంతో శనివారం వేకువజామునే గత రెండు రోజులుగా బసచేస్తున్న పర్యాటకులు కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద బారులు తీరారు. ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం జలపాతం వద్ద పర్యాటకులు స్నానాలు చేశారు. ఇదిలా ఉండగా ప్రతియేటా కుట్రాలం జలపాతాల వద్ద నిర్వహించే సీజన్ ఫెస్టివల్‌ను ఈ యేడాది ఏడురోజులపాటు జరిపేందుకు చర్యలు చేపడుతున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.

క్లాట్‌లో స్టేట్ టాపర్ గిరిజన విద్యార్థికి సీఎం ప్రశంస



విద్యార్థి భరత్

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): క్లాట్‌లో ఉత్తీర్ణుడైన తిరుచ్చి జిల్లా పచ్చమైన తేనూరు గిరిజన గ్రామానికి చెందిన విద్యార్థి భరత్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. న్యాయశాస్త్ర కళాశాల్లో గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్టుగ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) ప్రవేశపరీక్షల్లో భరత్ రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించడం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. లాకోర్సు చదివేందుకు భరత్‌కు డీఎంకే న్యాయవిభాగం, ఆ విభాగం కార్యదర్శి ఇలంగో అండగా ఉంటారని, అతడికి అవసరమైన సహాయం చేస్తారని, విద్యకు సంబంధించి కూడా సాయమందిస్తారని స్టాలిన్ తన 'ఎక్స్'పేజీలో పేర్కొన్నారు.



కోయంబత్తూరులో సంగీత కచేరికి నిర్వహించేందుకు వెళ్ళిన ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను సత్కరిస్తున్న బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

మురుగన్ మహానాడుపై స్టాలిన్ ఆందోళన తగదు

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్

ప్యారీస్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మదురైలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించదలచిన మురుగన్ మహానాడుపై ముఖ్యమంత్రి స్టాలిన్ అనవసరంగా ఆందోళన చెందుతున్నారని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. కోవై విమానాశ్రయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే విధంగా ముఖ్యమంత్రి స్టాలిన్ పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన, మురుగన్ మహానాడు గురించి ప్రజలను తప్పుదారి పట్టించేలా సమస్యలను లేవనెత్తుతున్నారని ఆరోపించారు. నాలుగేళ్ళ డీఎంకే పాలనలో భారీస్థాయిలో టాస్మాక్ అవినీతి జరిగిందని, త్వరలోనే ఈ వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ప్రధాన నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా జన గణన నిర్వహించేందుకు నిర్ణయించి అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. అదేవిధంగా ఏ రాష్ట్రానికి నష్టం కలుగకుండా నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని స్పష్టంగా తెలియజేశారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కూడా పునర్విభజనపై విడుదల చేసిన ప్రకటనకు పలు రాష్ట్రాలు స్వాగతించాయని తెలిపారు.తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో కుల గణన పూర్తైందని అయితే తమిళనాడులో కులాల వారీగా జన గణన నిర్వహించేందుకు సీఎం స్టాలిన్ ఎందుకు భయపడుతున్నారో అర్థంకావడం లేదన్నారు. తమిళుల ఆరాధ్య దైవం మురుగన్ పేరుతో మదురైలో మురుగ భక్తుల మహానాడు నిర్వహించడం సీఎం స్టాలిన్‌కు ఇష్టంలేదని, అయినప్పటికీ భక్తులను నిరాశపరచకుండా మహానాడు ప్రశాంతంగా నిర్వహించదలచినట్లు కేంద్రమంత్రి మురుగన్ తెలిపారు.

● మద్యం విక్రయాల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచాలని కేసు...
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

ప్యారీస్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం కొనుగోలు, అమ్మకాల వివరాలను టాస్మాక్ సంస్థ వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరుతూ దాఖలైన కేసులో రాష్ట్రప్రభుత్వం వివరణ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆదేశించింది. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌కు చెందిన రామ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌లో, ప్రతీఏటా టాస్మాక్ వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్న వార్షిక నివేదికలో మద్యం రకాలను కొనుగోలు చేస్తున్న సంస్థలు, భారీస్థాయిలో విక్రయిస్తున్న మద్యం వివరాలు, వాటి ధర, లైసెన్స్ ఫీజులు, ఆదాయం వంటి వివరాలు ఉండేవని తెలిపారు. అయితే, 2016-2017 తర్వాత టాస్మాక్ సంస్థ తన వార్షిక నివేదికను వెబ్‌సైట్‌లో విడుదల చేయడంలేదని, దీనిపై జరిపిన విచారణలో కొన్నిరకాల మద్యం అధికధరకు విక్రయించడం, రసీదు లేకుండా విక్రయించడం, కొన్ని సంస్థల నుంచి మాత్రమే మద్యాన్ని అధికస్థాయిలో కొనుగోలు చేసిన వివరాలు తెలిశాయని ఆ పిటిషన్‌లో సూచించారు. టాస్మాక్ 11 సంస్థల నుండి 125 రకాల మద్యపానీయాలను, 7 సంస్థల నుండి 38 రకాల బీర్లు కొనుగోలు చేయాల్సివుందని, అయితే టాస్మాక్ సంస్థ అలా చేయకుండా తమకు అనుకూలమైన సంస్థల నుంచి మాత్రమే లాభాపేక్షతో మద్యాన్ని కొనుగోలు చేస్తోందని పిటిషనర్ ఆరోపించారు. 2017 నుండి 2025వ సంవత్సరం వరకు టాస్మాక్‌కు సంబంధించిన అన్ని వివరాలతో వెబ్‌సైట్‌లో నివేదిక విడుదల చేసేలా ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ నాయస్థానాన్ని అభ్యర్థించారు. శుక్రవారం హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, మరియా గ్లాడ్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఈ పిటిషన్ విచారణకు రాగా, ప్రభుత్వ తరుపున హాజరైన న్యాయవాది పిటిషనర్ తరుపు న్యాయవాదులు వాదించారు. అనంతరం పిటిషనర్ అడిగిన ప్రశ్నలకు రాష్ట్రప్రభుత్వం వారంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించిన న్యాయమూర్తుల బెంచ్ విచారణను వారంరోజులకు వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

అక్రమ క్వారీల వ్యవహారం.. | హైకోర్టు ఆగ్రహం


ప్యారీస్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): క్వారీ యజమానులు భూమాత గుండెను కోసి ఆమె రక్తాన్ని తాగుతున్నారని మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్రమార్కులకు కొమ్ముకాసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా...

కోయంబత్తూరులోని కురవిపాళయం గ్రామంలో సెందామరై అనే వ్యక్తి 2009 నుంచి లీజుకు తీసుకున్న భూముల్లో క్వారీ నిర్వహిస్తున్నాడు. ఆ క్వారీ పనుల్లో ఉల్లంఘన జరుగుతుందంటూ అదే ప్రాంతానికి చెందిన రాధాకృష్ణ హైకోర్టులో ప్రజా వాజ్యం దాఖలు చేశారు. అనంతరం, హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన కమిటీ ఒక చిన్న ఉల్లంఘన జరిగిందని 2021లో నివేదిక అందజేసింది. దీని తర్వాత ఉల్లంఘనకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించిన న్యాయస్థానం ఈ కేసు ముగించింది. ఈ నేపథ్యంలో, ప్రత్యేక కమిటీ నివేదికను పరిశీలించిన కోవై సబ్ కలెక్టర్ 2022లో అక్రమంగా భూగర్భ వనరులను వెలికితీశారని సెందామరైకి రూ.32,29,77,792 జరిమానా విధించారు. దానిని వ్యతిరేకిస్తూ భూగర్భ, గనుల కమిషనర్ వద్ద అప్పీలు చేశారు. విచారించిన కమిషనర్ సబ్ కలెక్టర్ ఆదేశాలను రద్దు చేసి, జరిమానాలో రూ.2,48,119 తగ్గించారు.

ఈ నేపథ్యంలో , భూగర్భ, గనుల కమిషనర్ ఉత్తర్వులను సహజవనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి స్వచ్ఛందంగా సమీక్షించారు. కొవై సబ్ కలెక్టర్ విధించిన జరామానాను నిర్ధారిస్తూ కొత్త ఉత్తర్వులు జారీచేశారు.

ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ సెందామరై మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి టి.భరత్ చక్రవర్తి విచారించారు. పర్యావరణ అనుమతులు పొందిన తర్వాత క్వారీ ఆపరేషన్ జరుగుతోందని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదించారు. పరిహారం మొత్తాన్ని తగ్గిస్తూ భూగర్భ, గనుల శాఖ, ఉత్తర్వులను రద్దు చేయలేదని, ఈ ఉత్తర్వులను ప్రభుత్వశాఖ కార్యదర్శి రద్దు చేసిన విషయాన్ని ప్రభుత్వ న్యాయవాది న్యాయమూర్తికి తెలిపారు. ఇరు తరుపు వాదనల అనంతరం సంబంధిత క్వారీలను తొలగించాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పుప్రకారం, అక్రమంగా తవ్విన వనరులకు సమానమైన మొత్తాన్ని సంబంధిత పార్టీల నుండి తిరిగి పొందడంలో ఎటువంటి రాజీ పడొద్దని న్యాయస్థానం తెలిపింది.

దురాశపరుల నుండి భూమాతను రక్షించడానికి పర్యావరణ పరిరక్షణ చట్టం తీసుకురాబడిందని, అయితే ఈ చట్టాన్ని ఉల్లంఘించి భూదేవి రక్తం తాగుతున్న ఇలాంటి క్వారీ యజమానులతో కుమ్మక్కైన వారిపై క్రిమినల్ చట్టం కింద చర్యలు తీసుకోవాల్సిందిగా న్యాయమూర్తి భరత్‌చక్రవర్తి రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించారు.



చెన్నైలోని 'శ్రీ ఆంధ్రకళా స్రవంతి' ఉపాధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కేపీఎన్ సురేష్‌బాబు-విజయశ్రీ దంపతుల కుమారుడు రామ్ సుహాస్-సంహితల వివాహ రిసెప్షన్ శనివారం రాత్రి తాజ్‌కోరమండల్ హోటల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో అన్నానగర్ డీఎంకే ఎమ్మెల్యే మోహన్, స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు, గోపురం కుంకుమ అధినేత వైవీ హరికృష్ణ, అడ్వకేట్ ప్రభాకర్, గొల్లపల్లి ఇశ్రాయేలు, పి.సురేష్‌కుమార్, బీఎల్ కుమరవేల్, చారుగుండ్ల వెంకటేశ్వరరావు, జీఎస్ అనంత్‌కుమార్, దేవరకొండ రాజు తదితర తెలుగు ప్రముఖులతో పాటు బంధుమిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



హనుమంత, గజ వాహనాలపై గోవిందుడు

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు శనివారం ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై గోవిందుడు తిరుమాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కరుణించారు. ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 3గంటలకు వసంతోత్సవం తర్వాత బంగారు తిరుచ్చిపై స్వామివారు మాడవీధుల్లో ఊరేగారు. వాహనం ముందు గో, గోజ, అశ్వాలు వరుసక్రమంలో నడుస్తూ స్వామిపై భక్తిప్రపత్తులను చాటుకున్నాయి. కళాబృందాల ప్రదర్శనలు రంజింపచేశాయి. శనివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

స్వామి పిలుపుతోనే తిరుమలకు రాగలం

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): 'మనం అనుకున్నా.. స్వామి పిలిస్తేనే తిరుమలకు రాగలం' అని సినీ నటుడు రాజీవ్ కనకాల అన్నారు. తిరుమల శ్రీవారిని తన సహచరి సుమతో కలిసి శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'స్వామిని దర్శించుకున్న తర్వాత ఎంతో ఆనందంగా ఉంటుంది. అదొక అనిర్వచనీయ అనుభూతి' అని చెప్పారు. సుమ, రాజీవ్‌లతో పలువురు సెల్ఫీలు తీసుకున్నారు. కాగా ఎంపీ బీకే పార్థసారథి, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



సుమ, రాజీవ్ కనకాల

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో బాటగంగమ్మ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,174

తలనీలాలు సమర్పించినవారు: 35,132





ఏపీ పీజీసెట్ వివరాలు వెల్లడిస్తున్న సెట్ ఛైర్మన్ సీహెచ్ అప్పారావు, కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు

ఏపీ పీజీ సెట్‌కు సర్వం సిద్ధం

- 9, 10, 11, 12 తేదీల్లో పరీక్షలు
- ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష షెడ్యూల్ మార్పు
- 17 వర్సిటీల్లోని 25వేల సీట్ల భర్తీ

తిరుపతి(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ - 2025 నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు పీజీసెట్ ఛైర్మన్, ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు చెప్పారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ సురేంద్ర బాబు తదితరులతో కలిసి శనివారం వీసీ ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ విద్యామండలి ఆధ్వర్యంలో పీజీసెట్‌ను ఎస్వీయూ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు సెట్ కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు పూర్తి చేశారని పేర్కొన్నారు.

మూడు షిఫ్టుల్లో 30 కేంద్రాల్లో..

జూన్ 9, 10, 11, 12 తేదీల్లో రోజూ మూడు షిఫ్టులుగా పీజీ సెట్ జరగనుంది. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడవ సెషన్ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు జరగనున్నాయి. మొదటి రోజున 17 సబ్జెక్టులకు, రెండో రోజు 7 సబ్జెక్టులకు, మూడవ రోజున 5 సబ్జెక్టులకు, నాల్గవ రోజున 2 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ తోపాటు మన రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం 30 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి.

మేలైన మార్పులు

విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది పీజీ సెట్‌లో కొన్ని మార్పులు చేశారు. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, టూరిజం, లైఫ్ సైన్సెస్ సబ్జెక్టులను కలిపి ఒకే పరీక్షగా నిర్వహించనున్నారు. ఫలితంగా విద్యార్థులు ఒక్క పరీక్షతో ఏడు సబ్జెక్టుల్లో సీట్లు పొందే అవకాశం ఏర్పడింది. ఇలా ఇప్పుడు మొత్తం 31 సబ్జెక్టుల్లో పరీక్షలు జరగనున్నాయి.

తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో..

పీజీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులు డిగ్రీలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్య అభ్యసించి ఉంటారు. అందువల్ల రెండు మాధ్యమాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రశ్న పత్రాన్ని ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో సిద్ధం చేశారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషా సంబంధిత సబ్జెక్టులు మాత్రమే ఆయా మాధ్యమాల్లో ఉంటాయి.

తగ్గిన 6 వేల అప్లికేషన్లు

ఏపీలో మొత్తం 17 విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న 143 ప్రోగ్రామ్స్‌కు సంబంధించి సుమారు 25 వేల పీజీ సీట్లు ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకుగాను మొత్తం 25,688 మంది విద్యార్థులు ఏపీ పీజీసెట్-2025కు హాజరుకానున్నారు. అయితే గత ఏడాదితో పోల్చితే సెట్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈ దఫా సుమారు 6 వేల మంది తక్కువగా సెట్‌కు హాజరుకానున్నారు.

25వ తేదీలోపు ఫలితాలు

పీజీసెట్ ఫలితాలను ఈనెల 25వ తేదీలోపు ప్రకటిస్తామని ఛైర్మన్ చెప్పారు. ఫలితాలు విడుదల అయిన వెంటనే ప్రవేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గతంలో లాగానే ఈసారి కూడా కెమికల్ సైన్స్, లైఫ్‌సైన్స్, కంప్యూటర్‌సైన్స్, బోటనీ, జువాలజీ, మేథమేటిక్స్ వంటి సైన్స్ సబ్జెక్టుల్లో పోటీ ఎక్కువగా ఉందని, ఇంగ్లిష్, తెలుగు, హిస్టరీ, కామర్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వంటి సబ్జెక్టుల్లో ఒకమాదిరి పోటీ ఉందని వెల్లడించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయం మార్పు

ఏపీ పీజీ సెట్ షెడ్యూల్‌ను మార్చి 31వ తేదీన వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఐతే ఇటీవల ప్రకటించిన డీఎస్సీ షెడ్యూల్ కారణంగా పీజీసెట్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయంలో మార్పు చోటుచేసుకుంది. 9వ తేదీన పీజీసెట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షతోపాటు డీఎస్సీ పరీక్ష కూడా ఉండటంతో రెండింటికీ హాజరుకానున్న అభ్యర్థులు వర్సిటీ అధికారులకు విన్నపాలు పంపారు. ఆ మేరకు జూన్ 9వ తేదీ ఉదయం నిర్వహించతలపెట్టిన ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షను 10వ తేదీ మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించనున్నారు. ఇదితప్ప పీజీసెట్ షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులూ లేవని సెట్ ఛైర్మన్ వెల్లడించారు.

సూళ్లూరుపేట కమిషనర్‌పై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యపై శుక్రవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహేశ్వర్ కేసు నమోదు చేశారు. చిన్నయ్య తండ్రి ఉద్యోగంలో ఉండగానే.. ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి పదోన్నతులు కూడా పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో విచారణ ప్రారంభిస్తామన్నారు.

పుష్కరిణిలో సబ్బులు, షాంపుల బంద్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణిలో పరిశుభ్రతను పరిరక్షించేందుకు టీటీడీ ప్రత్యేక సిబ్బందిని నియమించింది. అత్యంత పవిత్రమైన, పరిశుభ్రమైన శ్రీవారి పుష్కరిణిలో ఇటీవల పరిశుభ్రత లోపించిందని భక్తుల నుంచి టీటీడీకి వరుసగా ఫిర్యాదులు అందాయి. 'పరిశుభ్రతకు నీళ్లొదులుతున్నారు' శీర్షికన ఆంధ్రజ్యోతి ఇటీవల కథనం ప్రచురించింది. ఈక్రమంలో ఉన్నతాధికారులు శ్రీవారి పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా నలుగురు సిబ్బందిని నియమించారు. భక్తులు దుస్తులు ఉతకకుండా, సబ్బులు, షాంపులు వినియోగించకుండా వీరు పర్యవేక్షిస్తారు.



పుష్కరిణి వద్ద విధుల్లో సిబ్బంది

పెద్ద ప్రమాదం..భక్తులు క్షేమం



చెట్టును ఢీకొన్న కారు

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైన సందర్భంలో 19వ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో నలుగురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

అత్యాధునికంగా అలిపిరి చెక్‌పాయింట్

- అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు




తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్ పాయింట్‌ను అత్యాధునిక తనిఖీ కేంద్రంగా తీర్చిదిద్దేలా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. భక్తులు ఎక్కువ సమయం వేచిఉండకుండా వాహనాల తనిఖీ, భక్తుల లగేజి స్కానింగ్ జరిగేలా అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులలో ఉన్న స్కానింగ్ వ్యవస్థను పరిశీలించాలని సూచించారు. టోల్‌ప్లాజాలో తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదిక తయారు చేయాలన్నారు. సమీక్ష అనంతరం అలిపిరి చెక్‌పాయింట్‌లో స్కానర్లను పరిశీలించి అధికారులు, సిబ్బందితో ఈవో మాట్లాడారు.

భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల కేంద్రం తనిఖీ

ఇలాఉండగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులతో కలిసి భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల జారీని శనివారం సాయంత్రం ఈవో శ్యామలరావు పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. శ్రీవారిమెట్టుమార్గం ద్వారా వెళ్లే కాలినడక భక్తులకు రోజుకు సరాసరి 5 వేల టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. శ్రీవారిమెట్టుకు సమీపంలోని శ్రీనివాసమంగాపురంలో డీడీ టోకెన్ల జారీకి ఆర్కియాలజీ నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.

కల్తీ నెయ్యి కేసులో ధర్మారెడ్డిని విచారించాలి

- జనసేన నేత కిరణ్‌రాయల్



తిరుపతి(జీవకోన), జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలకపాత్రధారి అయిన మాజీ ఇన్‌చార్జి ఈవో ధర్మారెడ్డిని అరెస్టు చేసి విచారించాలని జనసేన నేత కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంవత్సర కాలంగా ఆయన ఎక్కడ ఉన్నారో తెలియదని, వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లడ్డూలో కల్తీ పెద్ద పాపమని, డబ్బు కోసం ఇది జరగలేదని, ఒక మతంపై దాడికోసమే చేశారని ఆరోపించారు.భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారికి శిక్ష సరిపోదని.. ఉరి తీయాలన్నారు. నెయ్యి లేకుండా నాలుగేళ్ల పాటు లడ్డూలు అమ్మారని, ఈ విషయంలో ఒకరిద్దరు మీడియా సిబ్బంది కూడా సహకరించారన్నారు.టీటీడీలోని అన్ని విభాగాలకూ కీలకంగా వ్యవహరించిన ధర్మారెడ్డిని ఎవరు కాపాడుతున్నారనేది తేలాలన్నారు.అప్పటి పాలకమండలి సభ్యులకు కూడా ఇందులో భాగముందని వ్యాఖ్యానించారు.ఈ దొంగల ముఠాలో ప్రిన్సిపాల్ ఎవరంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ధర్మారెడ్డికి తెలియకుండా ట్యాంకులు పైకి ఎలా వెళతాయని ప్రశ్నించారు.కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా తప్పు చేసిన వారినే శిక్షించాలన్నారు. పర్చేజింగ్ కమిటీ మెంబర్లను కూడా విచారించాలన్నారు. ఈ అంశంపై చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి లడ్డూ జీఐ హక్కుల ఉల్లంఘనపై సీరియస్

- పలు సంస్థలకు టీటీడీ నోటీసులు

తిరుమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన శ్రీవారి లడ్డూప్రసాదం పేరును అనధికారికంగా వినియోగించుకుంటున్న కొన్ని సంస్థలపై టీటీడీ కొరడా ఝుళిపించింది. జీఐ(జియోగ్రాఫికల్ ఇండికేషన్) హక్కులను ఉల్లంఘిస్తూ స్వామి లడ్డూ పేరుతో తమ ఉత్పత్తులను విక్రయిస్తున్న, ప్రచారం చేస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలకు పూనుకుంది. ఇప్పటికే కొన్ని సంస్థలకు గత నెల 31న నోటీసులు జారీ చేసింది. 2009లోనే తిరుమల శ్రీవారి లడ్డూకు జీఐ పేటెంట్ లభించిన సంగతి తెలిసిందే. అంతకుముందు పదేళ్ల క్రితం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ చట్టం ప్రకారం జీఐ హక్కులను సాధించింది. పేటెంట్ హక్కులు, జీఐ పొందిన ఏకైక దేవాలయ ప్రసాదంగా శ్రీవారి లడ్డూ అగ్రస్థానంలో నిలిచింది. ఆన్‌లైన్ ద్వారా, నేరుగా కొన్ని స్వీట్స్ విక్రయ సంస్థలు శ్రీవారి లడ్డూ పేరుతో విక్రయిస్తున్నట్లు టీటీడీ గుర్తించింది. ఈ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు టీటీడీ లా విభాగం అధికారులు ఢిల్లీకి చెందిన సహదేవ లా చాంబర్స్ ద్వారా పుష్ మై కార్ట్, ట్రాన్సాక్ట్ ఫుడ్స్ లిమిటెడ్, ఇండియా స్వీట్ హౌస్ వంటి ఐదారు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. బయట విక్రయాలతో ఈ ప్రసాదానికి ఉన్న గౌరవాన్ని తగ్గిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఇప్పటికే పుష్ మై కార్ట్ తమ ఉత్పత్తుల జాబితా నుంచి లడ్డూ ప్రసాదం పేరును తొలగిస్తున్నట్టు ప్రకటించింది. మరికొన్ని కూడా తొలగించినట్టు తెలిసింది.

లడ్డూ ప్రసాదం స్వీట్ కాదు : ఈవో

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం. స్వీట్ కాదు. ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ఇది ప్రతీక టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. ఇలాంటి ప్రసాదం పేరును బయట సంస్థలు తప్పుగా వాడితే చర్యలకు వెనకడుగు వేయబోమన్నారు.

భక్తులకు శుభవార్త

- తిరుపతి టూ పూరి ఆర్టీసీ బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంతో పాటు ఒడిశా ప్రజలకు ఇది నిజంగా శుభవార్తే. పూరి జగన్నాథ స్వామి, తిరుమల శ్రీవారి ఆలయాలను సందర్శించాలనుకునే వారికోసం పూరి టూ తిరుపతికి ఒడిశా ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. తిరుపతి, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, బెర్హంపూర్ మీదుగా పూరి(భువనేశ్వర్)కి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇదే మార్గంలో నడుస్తాయి. ఇలా రెండు ప్రభుత్వాలు పరస్పర రహదారి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఏసీ స్లీపర్ 42 సీట్ల సామర్థ్యం, తాజా సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సదుపాయాలు, ఆకర్షణీయమైన రంగులతో తిరుపతి బస్టాండులో బస్సు సిద్ధంగా ఉంది. పురుషులకు రూ.2,750,స్త్రీలకు 50శాతంతో రూ.1,375గా టిక్కెట్ నిర్ణయించారు. ఈ విధానం ఉభయ రాష్ట్రాల ప్రజలకూ వర్తిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్సు బుకింగ్ చేసుకోవచ్చు.

బస్సు ప్రయాణించే రోజులు, వేళలిలా...

- ప్రతి శని, సోమవారాలు ఉదయం 9గంటలకు తిరుపతి బస్టాండు నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు పూరికి చేరుకుంటాయి.
- ప్రతి బుధ, శుక్రవారాలు ఉదయం 9 గంటలకు పూరి నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10గంటలకు తిరుపతికి చేరుకుంటాయి.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.







సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ - ఓపెన్ హౌస్ ఈవెంట్‌కు హాజరైన విద్యార్థులు

ఐఐటీలో ఓపెన్ హౌస్ ఈవెంట్

- ప్రత్యక్షంగా 60.. ఆన్‌లైన్‌లో 120మంది హాజరు

ఏర్పేడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ ఈవెంట్ జరిగింది. ఈ అవగాహన సదస్సులో 60మంది విద్యార్థులు ప్రత్యక్షంగా, 120మంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. పరిశోధనలు, కన్సల్టెన్సీ, పరిశోధనలు-పరిశ్రమల సహకారానికి అవకాశాలు, కెరీర్ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్ అవకాశాలపై ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా జీవితంపై స్పష్టతను అందించడం ద్వారా విద్యార్థులు కెరీర్ అభివృద్ధిపై దృష్టి సారించడానికి అవకాశం ఉంటుందని ఈ ఓపెన్ హౌస్ ద్వారా వివరించారు.

కారు డెకార్స్ యజమానిపై వైసీపీ శ్రేణుల దాడి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు డెకార్స్ యజమానిపై వైసీపీకి చెందిన ముగ్గురు యువకులు దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటన శనివారం తిరుపతి చింతలచేను వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మోహన్‌రావు చింతలచేను రోడ్డులో సీఎస్ఆర్‌కే పేరుతో కారు డెకార్స్ కంపెనీ నడుపుతున్నాడు. తిమ్మినాయుడుపాలెంకు చెందిన వైసీపీ నేత చైతన్యయాదవ్ భాగస్వామిగా ఉన్నాడు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. వివాదం ముదరడంతో కంపెనీ షోరూములో ఉన్న మోహన్‌రావుపై చైతన్య యాదవ్, అతని వర్గీయులు మూకుమ్మడిగా దాడి చేశారు. మోహన్‌రావుకు గాయాలయ్యాయి. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లింగేశ్వరనగర్‌లో ఫ్లెక్సీల రగడ

- వైసీపీ సర్పంచ్ అత్యుత్సాహంతో ఫ్లెక్సీలు, టెంట్ల ఏర్పాటు
- టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వనగర్‌లో సర్పంచ్ అత్యుత్సాహంతో చేసిన ఏర్పాట్లు ఉద్రిక్తతకు దారితీశాయి. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదానికి కారణమైంది. పోలీసుల కథనం మేరకు...లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటేశ్వరరావు(వైసీపీ) పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం గ్రామంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. షామియానా, టెంట్లతో పాటు రోడ్డుకు అడ్డంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టారు. దాదాపు 10 ఇళ్ల చుట్టూ టెంట్లు వేసి రాకపోకలకు దారి లేకుండా చేయడంతో సర్పంచ్ ఇంటి పక్కనే ఉంటున్న హేమలత(టీడీపీ) నిరసించారు. ప్రజలకు అసౌకర్యం కల్గించారంటూ ప్రశ్నించారు. ఈ దశలో ఇరు పక్షాల మధ్య వాదోపవాదోలు తీవ్రస్థాయికి చేరాయి. ఆగ్రహోదగ్రులైన టీడీపీకి చెందిన కొందరు బ్యానర్లు, ఫ్లెక్సీలను చించేశారు. దీంతో వైసీపీ నాయకులు, సర్పంచ్ వర్గీయులు హేమలతతో పాటు అతని కుమారుడుపై చిట్టిరాయులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీసులు, బ్లూకోల్ట్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సీఐ చిన్నగోవిందు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఆ సమయంలో వైసీపీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ డౌన్...డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే సీఐ చిన్నగోవిందు టీడీపీ కార్యకర్తలాగా వ్యవహరించి బ్యానర్లు, ఫ్లెక్సీలు చించి వేశారంటూ వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆయన అనుచరులు విమర్శించారు. స్టేషనుకు వచ్చి సీఐ వ్యవహార శైలిపై డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారించి నివేదిక ఇవ్వాలని సీఐ సునీల్‌కుమార్‌ను డీఎస్పీ ఆదేశించారు.

వేడుకగా తెప్పోత్సవాలు ప్రారంభం

- 10న పద్మావతి అమ్మవారికి గజ వాహన సేవ

తిరుచానూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి పద్మసరోవరంలో విహరించి భక్తులను అభయమిచ్చారు. ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించాక మధ్యాహ్నం కేటీ మండపంలో శ్రీకృష్ణస్వామికి అభిషేకం జరిగింది. సాయంత్రం ఉత్సవ మూర్తులను పుష్కరిణిలోకి వేంచేసి తెప్పలపై కొలువుదీర్చారు. రాత్రి 7.15గంటలకు వేడుకగా తెప్పోత్సవం ప్రారంభమైంది. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఉభయదేవేరుల సమేత శ్రీకృష్ణసమేత మూడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించారు. అనంతరం తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి తెప్పలపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు అమ్మవారు తెప్పలపై భక్తులకు దర్శనభాగ్యం ఇవ్వనున్నారు. 10న అమ్మవారికి గజ వాహన సేవ, 11న గరుడ వాహన సేవ జరగనుంది. తెప్పోత్సవాల కారణంగా ఆర్జిత సేవలను రద్దు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇన్‌చార్జి ఏఈఎస్వో శైలేంద్రబాబు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో తెప్పపై ఉభయదేవేరిలతో విహరిస్తున్న శ్రీకృష్ణస్వామి

ట్రంప్ విధానాలపై వ్యతిరేకత

- ఆందోళనలో అమెరికాలోని భారతీయులు
- ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ చలం





మాట్లాడుతున్న చలం, నారాయణ

తిరుపతి, జూన్7(ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధానాలతో ఇండియాతో పాటు పలు దేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ.చలం అన్నారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో 'ట్రంప్ విధానాలు భారతదేశంలో ప్రభావం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు పెంచడంతో ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఉత్పత్తిరంగం దెబ్బతిని నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఆయుధ వ్యాపారిగా మారిందని విమర్శించారు. అయినా ప్రధాని మోదీ ట్రంప్‌కు దాసోహం అంటున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు కార్యకర్తలు ట్రంప్ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 'కాశ్మీర్ సమస్య-బీజేపీ వైఖరి' అనే అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఇటీవల పెహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలను మోదీ రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలే కానీ అది యుద్ధంతో కాదని పేర్కొన్నారు. యుద్ధంతో సాధారణ పౌరులు చనిపోతారని అందుకే యుద్ధాన్ని వ్యతిరేకించామని వివరించారు. దీనిని బీజేపీ రాజకీయం చేసి సీపీఐపై అభాండాలు వేసేపిందన్నారు. అయితే ట్రంప్ యుద్ధాన్ని ఆపాలని చెప్పగానే ఆపివేశారని తెలియజేశారు. టెర్రరిస్టుల, మావోయిస్టుల అంతం కొనసాగుతుందని చెప్పడం కేవలం బీహార్‌లో ఎన్నికల లబ్ధి కోసమేనని విమర్శించారు. ఈ సదస్సుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షత వహించగా నగర కార్యదర్శి విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు.